# నయీంనగర్ అట్టుడికింది!

వరంగల్ నగరం మరోసారి రాజకీయ విమర్శలు, ఆరోపణలు, ప్రత్యారోపణలకు వేదికైంది. కాంగ్రెస్, భారాస శ్రేణుల తోపులాటలతో కీలకమైన నయీంనగర్ ప్రాంతం అట్టుడికింది. అభివృద్ధిపై ఇరు పార్టీల నేతలు సవాళ్లు, ప్రతిసవాళ్లు విసురుకున్నారు. హనుమకొండ నయీంనగర్ వంతెన, నాలా అభివృద్ధి పనులపై కాంగ్రెస్, భారాస నేతలు పరస్పరం విమర్శలు గుప్పించుకోవడంతో నయీంనగర్‌లో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది.

– నయీంనగర్, న్యూస్‌టుడే



భారాస-కాంగ్రెస్ నాయకుల మధ్య తోపులాట

☛ గంటకుపైగా ఉద్రిక్తతతో ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి

☛ కాంగ్రెస్, భారాస పరస్పర ఆరోపణలు

## అసలేం జరిగిందంటే..

వరంగల్ నగరం అభివృద్ధిపై సోమవారం నయీంనగర్ వద్ద ప్రెస్‌మీట్ నిర్వహిస్తామని భారాస, కాంగ్రెస్ నాయకులు సమాచారం ఇచ్చారు. దీంతో రెండు పార్టీల మధ్య ఘర్షణ తలెత్తకుండా పోలీసులు జాగ్రత్తపడ్డారు. మొదట భారాస నేతలకు అవకాశం కల్పించారు. మధ్యాహ్నం 12 గంటల వరకు సమావేశం పూర్తి చేయాలని సూచించారు. అనంతరం కాంగ్రెస్ నేతలకు అవకాశం ఇచ్చారు. భారాస జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్ పార్టీ శ్రేణులతో కలిసి నయీంనగర్ వంతెన వద్దకు చేరుకున్నారు. తమ ప్రభుత్వ హయాంలోనే వంతెన నిర్మాణానికి ప్రతిపాదనలు చేశామన్నారు. కొంతమంది తమ స్వార్థం కోసం విమర్శలు చేస్తున్నట్లు ఆరోపించారు. అంతలో కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలు అక్కడికి చేరుకున్నారు. ఈ క్రమంలో ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకోవడంతో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. అడ్డువచ్చిన పోలీసులను సైతం నెట్టేశారు. దీంతో డీసీపీ ఎస్‌కె. సలీమా, ఏసీపీ దేవేందర్‌రెడ్డి ప్రత్యేక బృందాలతో అక్కడికి చేరుకొని ఇరువర్గాల నేతలను సముదాయించారు. కేటాయించిన సమయం ముగిసినందున ఇక్కడి నుంచి వెళ్లిపోవాలని భారాస నేతలకు సూచించారు. దీంతో అధికార పార్టీకి వత్తాసు పలుకుతున్నారని గులాబీ నేతలు మండిపడ్డారు. వినయ్‌భాస్కర్‌తో పాటు పార్టీ శ్రేణులు హనుమకొండ-కరీంనగర్ ప్రధాన రహదారిపై బైఠాయించారు. ఈ ఆందోళన గంటకు పైగా జరగడంతో ట్రాఫిక్ స్తంభించింది. పోలీసులు వారిని అరెస్టు చేసి ఠాణాకు తరలించారు.

## 30 ఏళ్ల రాజకీయ జీవితంలో ఇలాంటి వారిని చూడలేదు

తన 30 ఏళ్ల రాజకీయ జీవితంలో ఇలాంటి గుండాల దాడిని చూడలేదని మాజీ ఎమ్మెల్యే వినయ్ భాస్కర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. హనుమకొండ భారాస కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 'అధికారం ఉందని శిలాఫలకాలు పగులకొట్టి, పోలీసులతో అరెస్టు చేయించడం తగదని అన్నారు. కేటీఆర్‌కు నీకు పోలిక అని ఎద్దేవా చేశారు. కొన్ని నెలలు సమయం ఇద్దామనుకున్నాం.. టార్గెట్ చేసి మాట్లాడుతున్నావు.. ఇది సరి కాదన్నారు. ప్రజా సమస్యలపై పోరాడుతానని స్పష్టం చేశారు. అరెస్టు చేయించి నగరమంతా తిప్పారు. రాజేందర్‌రెడ్డికి విజ్ఞప్తి, డిమాండ్ చేస్తున్నా పెద్దమ్మగడ్డలో కూల్చిన సమాధులను 48 గంటల్లో తిరిగి కట్టించాలి.. నాపై విమర్శలు చేసే వారి విజ్ఞతకే వదిలేస్తున్నా, రెచ్చగొట్టే చర్యలు వద్దు' అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కుడా మాజీ ఛైర్మన్లు యాదవరెడ్డి, సుందర్‌రాజ్, నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వినయ్‌భాస్కర్, సుందర్‌రాజ్ తదితరులను అరెస్ట్ చేసి ఠాణాకు తరలిస్తున్న ఏసీపీ దేవేందర్‌రెడ్డి

## కమీషన్ల కోసం అభివృద్ధిని విస్మరించారు..

గత భారాస ప్రభుత్వం కమీషన్ల కోసం కక్కుర్తిపడి ప్రజా సంక్షేమం, నగరాభివృద్ధిని విస్మరించిందని మహా నగర పాలక సంస్థ మేయర్ గుండు సుధారాణి ఆరోపించారు. ఆందోళనల అనంతరం నయీంనగర్ నాలా వద్ద విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. భారీ వర్షాల సమయంలో నగర ప్రజలను పట్టించుకోలేదని మండిపడ్డారు. వంతెన, నాలా అభివృద్ధికి 2002లో టెండర్ పూర్తయితే నిర్మాణ పనులు చేపట్టకపోవడంపై సమాధానం చెప్పాలన్నారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని సీఎం రేవంత్‌రెడ్డికి నాలా పరిస్థితి వివరించినట్లు తెలిపారు. 9 నెలల కాలంలో కాంగ్రెస్ చేపట్టిన అభివృద్ధి నగర ప్రజలకు తెలుసని పేర్కొన్నారు. స్మార్ట్ సిటీ నిధులు వెనక్కి పోకుండా నగరాభివృద్ధికి పూర్తి స్థాయిలో వినియోగించామన్నారు. సమావేశంలో తోట వెంకటేశ్వర్లు, గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ అజీజ్‌ఖాన్, కార్పొరేటర్లు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మేయర్ సుధారాణి

## అయ్యో పాపం!

ఈ పాప పేరు సాండి. హనుమకొండ జిల్లా ఐనవోలు మండలం కొండపర్తి గ్రామం. తండ్రి ఇల్లందుల సాంబయ్యది చాలా పేదరిక నేపథ్యం. సోమవారం తండ్రితో కలిసి ప్రజావాణికి వచ్చింది. అయిదో తరగతి చదువుతున్న ఈ అమ్మాయి పుట్టినప్పటి నుంచి మెదడు పూర్తిగా ఎదగక మానసిక వైకల్యంతో బాధపడుతోంది. కుడి చేయి కూడా సరిగా పనిచేయదు. తన కూతురుకు దివ్యాంగ పింఛను మంజూరు చేయాలని సాంబయ్య ఇప్పటికే కార్యదర్శి వద్ద దరఖాస్తు చేసుకున్నారు. ఇంత వరకు మంజూరు కాలేదు. కలెక్టర్‌కు మొరపెట్టుకుందామని హనుమకొండ కలెక్టరేట్‌లో జరిగే ప్రజావాణికి వచ్చారు. ఇకనైనా ఈ పాప దయనీయ స్థితిని చూసి అధికారులు పింఛన్ మంజూరు చేస్తే ఈ కుటుంబానికి ఎంతో ఆసరా ఉంటుంది.

–ఈనాడు, వరంగల్, హనుమకొండ కలెక్టరేట్, న్యూస్‌టుడే




హనుమకొండ కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి వివరాలు 9లో...


## విశ్రాంత అధికారులు సామాజిక సేవ చేయాలి

**వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే:** పోలీస్‌శాఖలో వివిధ హోదాల్లో పనిచేసి పదవీ విరమణ పొందిన ఉద్యోగులు ఆరోగ్యంపై శ్రద్ధ చూపించాలని వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. సెప్టెంబర్ 30న పదవీ విరమణ పొందిన ఉద్యోగులను సోమవారం కమిషనరేట్‌లో సీపీ సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలీసులు ప్రజల రక్షణకు నిరంతరం పనిచేస్తున్నారని తెలిపారు. ఎస్సైలు సయ్యద్ యూసుఫ్, కుమారస్వామి పదవీ విరమణ పొందారు. కార్యక్రమంలో అదనపు డీసీపీలు రవి, సంజీవ్, సురేశ్‌కుమార్, ఏసీపీ సురేంద్ర, ఆర్‌ఐలు, ఆర్ఎస్సైలు పాల్గొన్నారు.



పదవీ విరమణ పొందిన ఉద్యోగులను సన్మానిస్తున్న కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

## రూరల్ మార్ట్ ప్రారంభం

**ఐనవోలు, న్యూస్‌టుడే:** నాలుగేళ్లుగా నందనం కర్షక సేవా సహకార సంఘం చేపడుతున్న కార్యక్రమాలు ప్రజాదరణ పొందుతున్నాయని టెస్కాబ్ ఛైర్మన్ మార్నేని రవీందర్‌రావు, ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పేర్కొన్నారు. నందనంలో ఎఫ్ఎస్‌సీఎస్ ఆధ్వర్యంలో రూ.20 లక్షలతో ఏర్పాటు చేసిన రూరల్ మార్ట్‌ను సోమవారం ఎమ్మెల్యే, టెస్కాబ్ ఛైర్మన్ ప్రారంభించారు. మార్ట్‌ను పరిశీలించి ఎమ్మెల్యే సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం సొసైటీ భవనంలో ఏర్పాటు చేసిన మహాసభలో రవీందర్‌రావు మాట్లాడారు. సొసైటీ ద్వారా బ్యాంకు సేవలు, ఎరువుల విక్రయ కేంద్రాలు, పంట నిల్వల కోసం గోదాంలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. రెడ్డిపాలెంలో వేడుకల భవన నిర్మాణం పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. గతేడాది ఐనవోలులోని రూరల్ మార్ట్ వార్షిక లావాదేవీలు రూ.1.31 కోట్లు జరిపినట్లు వెల్లడించారు. నిత్యావసర సరకులు, ఆర్గానిక్ పదార్థాలను ఎమ్మార్పీ కంటే 5 శాతం తక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు తెలిపారు. అంతకుముందు సొసైటీ ద్వారా ఏడుగురు రైతులకు కర్షక మిత్ర పథకం ద్వారా రూ.56 లక్షల రుణాల చెక్కులను అందజేశారు. వైస్ ఛైర్మన్ చందర్‌రావు, డైరెక్టర్లు చిరంజీవి, కుమారస్వామి, బుచ్చిరెడ్డి, పద్మ, ఎలేంద్ర, సంపత్‌రావు, రామచంద్రం పాల్గొన్నారు.

## బతుకమ్మ, దసరా ఉత్సవాలకు ఏర్పాట్లు

కార్పొరేషన్, న్యూస్‌టుడే: సద్దుల బతుకమ్మ, దసరా ఉత్సవాలకు గ్రేటర్ వరంగల్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేయాలని మేయర్ గుండు సుధారాణి అధికారులకు సూచించారు. సోమవారం సాయంత్రం బల్దియా సమావేశ మందిరంలో అధికారులు, క్షేత్ర స్థాయి ఉద్యోగులతో సమావేశమయ్యారు. నగరంలోని 66 డివిజన్లలో పండగల నేపథ్యంలో చేయాల్సిన పనులను అడిగి తెలుసుకున్నారు. మేయర్ సుధారాణి మాట్లాడుతూ.. చెరువులు, కుంటలు, మైదానాల వద్ద కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. కాజీపేట బంధం చెరువు, హనుమకొండ పెద్ద వడ్డెపల్లి, పద్మాక్షిగుండం, దేశాయిపేట చిన్నవడ్డెపల్లి, ఉర్సు రంగసముద్రం, శివనగర్ తదితర ప్రాంతాల్లో తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. కమిషనర్ డా. అశ్విని తానాజీ, అదనపు కమిషనర్ రాజేందర్ రెడ్డి, ఉప కమిషనర్లు కృష్ణారెడ్డి, ప్రసన్న రాణి, ఎస్ఈలు రాజయ్య, ప్రవీణ్ చంద్ర, సీఎంహెచ్ఓ డా. రాజేష్, సిటీప్లానర్ రవీందర్ తదితరులున్నారు.

# కష్టేఫలి..!

డీఎస్సీలో మెరిశారు.. అనుకున్నది సాధించారు!

'డీఎస్సీ-2024లో అర్హత సాధించిన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన మంగళవారం నుంచి హనుమకొండ సుబేదారిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉంటుంది. సరైన ధ్రువపత్రాలతో హాజరుకావాలి. పూర్తి వివరాలకు డీఈవో కార్యాలయంలో సంప్రదించాలి'

–న్యూస్‌టుడే వరంగల్ విద్యావిభాగం

కల నెరవేరింది.. కష్టానికి ఫలితం దక్కింది. డీఎస్సీ నోటిఫికేషన్ కోసం ఎన్నో ఏళ్లుగా వీరు ఎదురుచూశారు. ఇతర అవకాశాలు ఉన్నా కాదనుకున్నారు. ప్రభుత్వం నోటిఫికేషన్ ఇవ్వడంతో దీక్షగా చదివి చివరికి అనుకున్నది సాధించారు. ప్రభుత్వం సోమవారం వెల్లడించిన డీఎస్సీ ఫలితాల్లో సబ్జెక్టులవారీగా జిల్లాల్లో మొదటి, రెండో ర్యాంకులు సాధించినవారి గురించి స్ఫూర్తిదాయక కథనం..



నెక్కొండకు చెందిన మేడి నాగరాజు డీఎస్సీ (తెలుగు లాంగ్వేజ్ పండిట్)లో మహబూబాబాద్ జిల్లాలో 70.17 మార్కులతో మూడో ర్యాంకు సాధించారు. నిరుపేద కుటుంబానికి చెందిన నాగరాజు ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తిలోని ప్రభుత్వ పాఠశాలలో చదివారు.

–నెక్కొండ, న్యూస్‌టుడే

### పీడీ, పీఈటీ సైతం



వరంగల్ జిల్లా సంగెం మండలం మొండ్రాయికి చెందిన నేతుల రాజు డీఎస్సీలో ప్రథమ ర్యాంకు సాధించి ఫిజికల్ డైరెక్టర్, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. – సంగెం

### మూడో ప్రయత్నంలో



హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం మాణిక్యాపూర్‌కు చెందిన కోన రాజు మూడో ప్రయత్నంలో సోషల్ స్టడీస్ విభాగంలో 73.90 మార్కులతో జిల్లా రెండో ర్యాంకు సాధించారు. కోన మొగిలియ్య-కనకమ్మ దంపతుల చిన్న కుమారుడు రాజు హనుమకొండలో ఎం.కాం, హుజూరాబాద్‌లో బీఈడీ చదివారు. 2018 డీఎస్సీలో 0.19 మార్కు తేడాతో ఉద్యోగం కోల్పోయాడు. – భీమదేవరపల్లి



☛ వరంగల్ జిల్లా నర్సంపేటకు చెందిన మద్రి రాజేశ్ ప్రత్యేక డీఎస్సీ (ఐఈడీ) జనరల్ కేటగిరీలో జిల్లా స్థాయిలో రెండో ర్యాంకు సాధించారు. మధ్య తరగతి కుటుంబానికి చెందిన మద్రి సుజాత, లక్ష్మీనారాయణ తల్లిదండ్రులు. తండ్రి 14 ఏళ్ల క్రితం మృతి చెందగా సుజాత పిల్లలను కష్టపడి చదివించింది.

– నర్సంపేట, చెన్నారావుపేట

### భార్యభర్తలు సాధించారు..



భీమదేవరపల్లి మండల కేంద్రానికి చెందిన మార్పాటి శ్రీధర్‌రెడ్డి-స్వాతి దంపతులు ఉపాధ్యాయ కొలువులు సాధించారు. శ్రీధర్‌రెడ్డి స్థానిక ఎంఈవో కార్యాలయంలో, స్వాతి హుజూరాబాద్ ఎంఈవో కార్యాలయంలో పొరుగు సేవల కింద ప్రత్యేక విద్య బోధకులుగా పనిచేస్తున్నారు. ప్రత్యేక విద్య విభాగంలో స్కూల్ అసిస్టెంటు, ఎస్జీటీ రెండు ఉద్యోగాల్లో కరీంనగర్ జిల్లా మొదటి ర్యాంకు సాధించి కొలువు సాధించారు. శ్రీధర్‌రెడ్డి హనుమకొండ జిల్లాలో ప్రత్యేక విద్య విభాగంలో ఎస్జీటీగా, స్కూల్ అసిస్టెంటుగా జిల్లా మొదటి ర్యాంకులు సాధించారు. – భీమదేవరపల్లి

### ఒకేసారి మూడు ఉద్యోగాలు..



జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలంలోని గిద్దెముత్తారం గ్రామానికి చెందిన మామిడి మహేశ్ మూడు ఉద్యోగాలు సాధించి మురిపించారు. తెలుగు పండిట్ విభాగంలో 80.90 మార్కులతో జిల్లా మొదటి ర్యాంకు, స్కూల్ అసిస్టెంట్ తెలుగులో 76.40 మార్కులతో జిల్లా మూడో ర్యాంకు, స్కూల్ అసిస్టెంట్ సోషల్‌లో 73.40 మార్కులతో జిల్లా ఐదో ర్యాంకు సాధించారు. మహేశ్ ప్రస్తుతం ప్రభుత్వ గురుకుల టీచర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. తండ్రి సమ్మయ్య, కుటుంబ సభ్యులు, గురువుల ప్రోత్సాహంతో మంచి ఫలితం సాధించేందుకు కారణమైందని ఆయన చెప్పారు. –చిట్యాల

### కొలువు వదులుకొని సన్నద్ధం



వరంగల్ జిల్లా ఖానాపురం మండలం రాగంపేట గ్రామంలోని వ్యవసాయ కుటుంబంలో పుట్టి పెరిగిన ఎలగందుల శ్వేత మొదటి ర్యాంక్ సాధించారు. ప్రస్తుతం హనుమకొండ వికాస్‌నగర్‌లో ఉంటున్న ఆమె బీఎస్సీ, డీఈడీ చదివారు. ఎస్జీటీ విభాగంలో 100 మార్కులకు గాను 83.37 మార్కులు సాధించారు. గతంలో నల్లబెల్లి మండలంలో పంచాయితీ కార్యదర్శి ఉద్యోగం సాధించిన ఆమె.. ఆ ఉద్యోగం వదులుకొని ఉపాధ్యాయ వృత్తిపై ఉన్న ఆసక్తితో డీఎస్సీ రాశారు. భర్త శ్రీకాంత్ ఎస్సైగా పని చేస్తున్నారు. – రంగశాయిపేట



☛ వరంగల్ జిల్లా ఖానాపురం మండలం అశోక్‌నగర్‌కు చెందిన జగతి సంపత్ డీఎస్సీ స్కూల్ అసిస్టెంటు (సాంఘికశాస్త్రం) విభాగంలో రెండో ర్యాంకు సాధించారు. ఆయన ప్రస్తుతం వరంగల్‌లోని రిజిస్ట్రేషన్ కార్యాలయంలో డాక్యుమెంటు రైటర్‌గా పని చేస్తున్నారు. – ఖానాపురం



☛ వేలేరు మండలం పీచర గ్రామానికి చెందిన యువకుడు సొన్నాయిల రాహుల్ రెండు ఉద్యోగాలను సాధించాడు. వేలేరు మండలం పీచరకు చెందిన సొన్నాయిల రాజు- స్వరూపల కుమారుడు. స్కూల్ అసిస్టెంట్( సోషల్ స్టడీస్)లో జిల్లా మొదటి, ఎస్జీటీలో జిల్లా నాలుగో ర్యాంకు సాధించాడు. – వేలేరు

### కష్టాలు ఎదుర్కొని..



జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఒడిపిలవంచ గ్రామానికి చెందిన గడ్డం ఫణిందర్ జిల్లా 3వ ర్యాంకు సాధించాడు. తండ్రి వైకుంఠం ఏడాది కిందట మృతి చెందగా తల్లి పద్మ గ్రామంలో రేషన్ డీలర్‌గా పనిచేస్తున్నారు. గతేడాది డిసెంబర్‌లో స్టాఫ్ సెలక్షన్ కమిషన్ నియామకాల్లో మల్టీ టాస్కింగ్ స్టాఫ్ ఉద్యోగం సాధించాడు. డీఎస్సీ నోటిఫికేషన్ రావడంతో ఉద్యోగానికి సెలవుపెట్టి పట్టుదలతో చదివి ఉన్నత ర్యాంకు సాధించాడు. గ్రూప్-4లోనూ జిల్లాలో 13వ ర్యాంకు తెచ్చుకున్నారు. – కాటారం

☛ మహబూబాబాద్ జిల్లా తొర్రూరు డివిజన్ కేంద్రంలోని దుబ్బతండాకు చెందిన గుగులోతు నిఖిల్ స్కూల్ అసిస్టెంట్ బయోసైన్స్ విభాగంలో జిల్లా ప్రథమర్యాంక్ సాధించారు. ప్రస్తుతం పెద్దవంగర మహాత్మాజ్యోతిబాపులే పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. – తొర్రూరు


## లడ్డూ వివాదంపై విచారణ చేపట్టాలని ధర్నా



**సుబేదారి, న్యూస్‌టుడే:** తిరుపతి దేవస్థానంలో లడ్డూ తయారీ వివాదంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని భజరంగ్‌దళ్ తెలంగాణ ప్రాంత సంయోజక్ శివరాములు డిమాండ్ చేశారు. లడ్డూ కల్తీకి వ్యతిరేకంగా దేశవ్యాప్త ఆందోళనలో భాగంగా సోమవారం వరంగల్ కలెక్టరేట్ నుంచి హనుమకొండ కలెక్టరేట్ వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్, హిందూ సంస్థలు ర్యాలీ నిర్వహించాయి. దోషులను శిక్షించాలని నినాదాలు చేశారు. కలెక్టరేట్ లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. భక్తులు పవిత్రంగా భావించే తిరుమల ప్రసాదాన్ని గత పాలకులు అపవిత్రంగా తయారు చేశారన్నారు. హిందువుల మనోభావాలు దెబ్బతిన్నాయన్నారు. అన్యాక్రాంతమైన ఆలయ భూములను తిరిగి స్వాధీనం చేసుకోవాలన్నారు. నాయకులు కేశిరెడ్డి జైపాల్ రెడ్డి, రాజు, ఆదిత్య సాయి, ఓంకుమార్, రమేష్, రఘుపతి పాల్గొన్నారు.

## ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోరేమి?

**కార్పొరేషన్, న్యూస్‌టుడే:** వారానికి ఒక్కసారైనా మా సమస్యలు వివరించొద్దా?, పదులసార్లు ఫిర్యాదులు చేసినా.. సమస్యలు పరిష్కరించడం లేదని పలు కాలనీల ప్రజలు అసహనం వ్యక్తం చేశారు. కమిషనర్‌కు సమస్యలు చెప్పేందుకు వెళ్తుంటే కొందరు చిరుద్యోగులు అడ్డుకోవడం సరికాదని మండిపడ్డారు. సోమవారం బల్దియా సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణికి 76 అర్జీలు వచ్చాయి. అందులో ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించినవి 21, ప్రజారోగ్యం 10, పన్నుల శాఖవి 5, టౌన్‌ప్లానింగ్ 40, వీధి దీపాలపై ఒక అర్జీ వచ్చినట్లు అధికారులు తెలిపారు. కమిషనర్ డా.అశ్విని తానాజీ వినతులు స్వీకరించారు. ప్రతి దరఖాస్తును నిశితంగా పరిశీలించి, పరిష్కారానికి కృషి చేయాలని కమిషనర్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో అన్ని విభాగాల వింగ్ అధికారులు పాల్గొన్నారు.









## భువన్ సర్వే వేగవంతం

**కార్పొరేషన్, న్యూస్‌టుడే:** గ్రేటర్ వరంగల్ పరిధిలో ఆస్తిపన్ను అసెస్‌మెంట్ల భువన్ యాప్ సర్వే ముమ్మరం చేశామని కమిషనర్ డా. అశ్విని తానాజీ తెలిపారు. సోమవారం సాయంత్రం రాష్ట్ర పురపాలక శాఖ సంచాలకులు వీపీ.గౌతమ్ హైదరాబాద్ నుంచి మున్సిపల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్సు ద్వారా మాట్లాడారు. భువన్ సర్వే, స్వచ్ఛతా హీ సేవా, ఏబీసీ కేంద్రాల నిర్వహణ, డీఆర్‌సీ సెంటర్లు, ఇంటింటా చెత్త సేకరణ, డెంగీ, కాలానుగుణ వ్యాధుల నివారణ, ఎల్ఆర్ఎస్ తదితర అంశాలపై దిశానిర్దేశం చేశారు. సీఎంహెచ్‌వో డా.రాజేష్, బయాలజిస్టు మాధవరెడ్డి, హెచ్‌వో రమేష్, పన్నులశాఖ అధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.



## బాలికల బంగారు భవిష్యత్తుకే ఆరోగ్య పరీక్షలు

**ఐనవోలు, న్యూస్‌టుడే:** ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న విద్య, వసతులను విద్యార్థినులు సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని వరంగల్ ఎంపీ కడియం కావ్య అన్నారు. ఐనవోలు కస్తూర్బా బాలికల పాఠశాలలో సోమవారం విద్యార్థినులకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరోగ్య భద్రత కార్డుల పంపిణీ కార్యక్రమానికి హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావిణ్య, ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు, టెస్కాబ్ ఛైర్మన్ మార్నేని రవీందర్‌రావుతో కలిసి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై అందజేశారు. పాఠశాల ఆవరణలో జిల్లా విద్యాశాఖ అధికారి వాసంతి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. సామాజిక మాధ్యమాలకు దూరంగా, అప్రమత్తంగా ఉండాలన్నారు.

**జిల్లాలో మొదటగా:** కలెక్టర్ ప్రావిణ్య మాట్లాడుతూ.. చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు పాఠశాలల్లో ఆరోగ్య భద్రత కార్డులు అందిస్తున్నామని చెప్పారు. ఈ కార్డుల ద్వారా బాలికలకు ప్రతి నెల వైద్య పరీక్షలు నిర్వహించి ఆరోగ్య వివరాలను నమోదు చేస్తామని వివరించారు. జిల్లాలో మొదటగా ఐనవోలు పాఠశాలలో ఆరోగ్య కార్డులు అందిస్తున్నామని.. జిల్లా వ్యాప్తంగా 4 వేల మంది విద్యార్థులకు ఇస్తామని చెప్పారు. అంతకుముందు పాఠశాలలో విద్యార్థుల వసతులపై తనిఖీ చేశారు.

**ఎమ్మెల్యే వివాదాస్పద వ్యాఖ్యలు:** వరంగల్ ఎంపీగా ఎన్నికయ్యాక మొదటిసారి ఐనవోలుకు వస్తున్న కడియం కావ్యను ముందుగా దేవాలయానికి తీసుకెళ్లాలని కాంగ్రెస్ కార్యకర్తలు భావించారని.. తాను మాత్రం గుడి కంటే బడికే అధిక ప్రాధాన్యమిస్తానని ఎమ్మెల్యే నాగరాజు పేర్కొన్నారు. అందుకే ముందుగా ఎంపీని పాఠశాలకే తీసుకువచ్చానని చెప్పారు. ఈ సందర్భంగా ఆయన దేవాలయాలను ఉద్దేశించి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బాలికలు ఎలాంటి సమస్యలు వచ్చినా తన దృష్టికి తీసుకురావాలని, ఇక నుంచి ఫిర్యాదుల బాక్సు పాఠశాలలో ఏర్పాటు చేస్తానన్నారు. ప్రతి నెల ఆ బాక్సును తనిఖీ చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం విద్యార్థినులకు క్రీడా పరికరాలను అందజేశారు. ఈ తర్వాత ఐనవోలు మల్లికార్జునస్వామిని ఎంపీ, ఎమ్మెల్యే, కలెక్టర్, టెస్కాబ్ ఛైర్మన్ దర్శించుకున్నారు. ఈ కార్యక్రమాల్లో డీఎంహెచ్‌వో లలితాదేవి, తహసీల్దార్ విక్రమ్‌కుమార్, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఎంఈవో ఆనందం, పాఠశాల ప్రత్యేకాధికారిణి సత్యవాణి, దేవస్థాన ఈవో నాగేశ్వర్‌రావు, మామునూర్ ఏసీపీ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



బాలికలకు ఆరోగ్య భద్రత కార్డులు అందజేస్తున్న ఎంపీ కావ్య, కలెక్టర్ ప్రావిణ్య, ఎమ్మెల్యే నాగరాజు, టెస్కాబ్ ఛైర్మన్ రవీందర్‌రావు, డీఈవో వాసంతి, డీఎంహెచ్‌వో లలితాదేవి

## రైతు బంధు, కౌలు డబ్బులు వచ్చేలా చేశారు



ములుగు మండలం జాకారం గ్రామానికి చెందిన ఈయన పేరు మామిడిశెట్టి చిన్న మల్లయ్య. ఇద్దరు కుమారులు ఉన్నారు. వీరికి పెళ్లిళ్లు చేసి ఇళ్ల స్థలాలు, భూములు పంచి ఎకరం భూమిని తమ పోషణ నిమిత్తం ఉంచుకున్నారు. ఆ భూమి పొరపాటున పెద్ద కొడుకు రాజు పేరున పాసుబుక్‌లో నమోదైంది. దీంతో రైతుబంధు పెద్దకుమారుడికే వెలుతోంది. తండ్రి తన పోషణ నిమిత్తం ఉంచుకున్న భూమిని చిన్న కుమారుడు కౌలుకు చేస్తూ కౌలు డబ్బులు తండ్రికి ఇవ్వడం లేదు. దీంతో మామిడిశెట్టి చిన మల్లయ్య ములుగు ఆర్డీవో సత్యపాల్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. స్పందించిన అధికారి చట్ట ప్రకారం నోటీసులు జారీ చేశారు. తహసీల్దారు విచారణ జరిపి ఆర్డీవోకు నివేదిక సమర్పించారు. ఇరు వర్గాల వాదనలు విన్న ఆర్డీవో మల్లయ్య భూమి ఆర్జీదారు పేరిట నమోదు చేయాలని సెప్టెంబరు 9న ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో రైతు బంధు, కౌలు డబ్బులు ఆర్జీదారుకు చెందేలా మార్గం సుగమమైంది.

## ప్రతి నెలా రూ.2 వేలు చెల్లించాలి




వెంకటాపురం మండలం నల్లగుంట గ్రామానికి చెందిన గోదిశాల సమ్మక్కకు ఇద్దరు కొడుకులు ఉన్నారు. పెద్ద కొడుకు ఉద్యోగరీత్యా హనుమకొండలో ఉంటున్నారు. ఊళ్లో ఆయనకు పంచి ఇచ్చిన ఇంట్లో సమ్మక్క నివాసం ఉంటోంది. చిన్న కొడుకు మరణించిన తర్వాత కోడలు ఆ ఇంట్లో సమ్మక్కను ఉండనివ్వడం లేదు. పెద్ద కుమారుని వాటా కూడా తమకే చెందుతుందని గొడవ పడింది. దీంతో వేరే ఇంట్లో నివాసం ఉంటున్నానని ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై ఇరువురికి నోటీసులు జారీ చేశారు. వాదనలు విన్న అనంతరం పెద్ద కుమారుడికి వాటాగా ఉన్న ఇంటిలో సమ్మక్క నివాసం ఉండేలా, ఆమె జీవనానికి పెద్ద కుమారుడు రవీందర్, చిన్న కోడలు శ్రీలత నెలకు రూ.2 వేలు ఇవ్వాలని ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి ఆదేశిస్తూ సెప్టెంబరు 19న ఉత్తర్వులు జారీ చేశారు.

పిల్లలను పెంచి.. పెద్దచేసిన తల్లిదండ్రులు వృద్ధాప్యంలో నిరాదరణకు గురవుతున్నారు. దీంతో మలిదశ వయసులో క్షోభ అనుభవిస్తున్నారు. బతుకుమార్గం చూపిన అమ్మానాన్నలను కంటికిరెప్పలా కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది.. చట్టపరంగా వృద్ధులకు హక్కులు ఉన్నాయి. నిరాదరణకు గురవుతున్న సందర్భాల్లో న్యాయస్థానాలు అండగా ఉంటున్నాయి.. మంగళవారం అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం.

వయోవృద్ధులకు ఎలాంటి సమస్యలు ఎదురైనా టోల్‌ఫ్రీ 14567 నంబరును సంప్రదించాలి

# పోషణ చట్టం.. వృద్ధులకు పట్టం



న్యూస్‌టుడే- హనుమకొండ కలెక్టరేట్, నిర్మాణ్‌పేట, ములుగు

### అండగా చట్టాలు..

తల్లిదండ్రులు, వయోవృద్ధుల పోషణార్థం, సంరక్షణకు ప్రత్యేక చట్టాలు ఉన్నాయి.. హిందూ దత్తత, పోషణ చట్టం-1956 ప్రకారం వృద్ధులైన తల్లిదండ్రుల పోషణ బాధ్యత పిల్లలదే. చాలా మంది తల్లిదండ్రులు తమ పిల్లలపై ప్రేమతో కేసులు వేయడం లేదు. దీంతో వేగవంతమైన సహాయాన్ని అందించేందుకు న్యాయ స్థానాలతో సంబంధం లేకుండా తల్లిదండ్రులు, వయోవృద్ధుల పోషణ సంక్షేమ చట్టం- 2007ను కేంద్ర ప్రభుత్వం రూపొందించింది. తెలంగాణ ప్రభుత్వం సవరణ నియమావళి-2022ను రూపొందించింది.

### దరఖాస్తు ఎవరికి సమర్పించాలి..?

వృద్ధులు, తల్లిదండ్రులు ఎక్కడ నివసిస్తున్నారో, ఇంతకుముందు చివరిసారిగా ఎక్కడ నివసించారో తెలుపుతూ వారి పిల్లలు లేదా బంధువులు ఎక్కడ నివసిస్తారో.. తెలుపుతూ ఆయా జిల్లాలోని రెవెన్యూ డివిజనల్ అధికారి(మెయింటనెన్స్ ట్రిబ్యునల్), జిల్లా సంక్షేమాధికారికి పోషణ ఖర్చుల కోసం దరఖాస్తు చేసుకోవాలి.

### 90 రోజుల్లో విచారణ

వయోవృద్ధులు దరఖాస్తు చేసుకున్న 90 రోజుల వ్యవధిలో ట్రిబ్యునల్ పిల్లలకు నోటీసులు పంపించి విచారణాధికారులచే వాదనలు, సాక్ష్యాలు సేకరించి పోషణ ఖర్చుల చెల్లింపునకు ఆదేశిస్తుంది. మూడు నెలల పాటు సదరు పిల్లలు పోషణ ఖర్చులు ఇవ్వకపోతే తల్లిదండ్రులు తిరిగి ట్రిబ్యునల్‌ను ఆశ్రయించొచ్చు. ఉత్తర్వులు పాటించని పిల్లలు, బంధువులకు జరిమానా, జైలు శిక్ష విధించే హక్కు దానికి ఉంటుంది. పిల్లలు, బంధువులు పోషణ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే తిరిగి వారి ఆస్తులను స్వాధీనం చేసుకునే హక్కు ఉంటుంది.

నడవలేని వయోవృద్ధులకు వీల్‌చైర్లు, చేతి కర్రలు, ఇతర పరికరాలు, వినికిడి యంత్రాలు, కళ్లజోడులు అందజేస్తారు. వృద్ధులు జిల్లా సంక్షేమాధికారికి దరఖాస్తు చేసుకోవాలి. వృద్ధాప్యంలోని తల్లిదండ్రుల పోషణ బాధ్యత పిల్లలదే.. పిల్లలతో ఇబ్బందులు ఎదురైతే జిల్లా సంక్షేమాధికారి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని హనుమకొండ జిల్లా ఇన్‌ఛార్జి సంక్షేమాధికారిణి రాజమణి తెలిపారు.



టోల్‌ఫ్రీ నంబరుపై వృద్ధులకు అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీలు (పాత చిత్రం)

### కనీసం తిండి పెట్టకుండా..



స్టాండు సాయంతో మెట్లు దిగుతున్న ఈ వృద్ధుడి పేరు వేల్పుల నర్సయ్య వయసు 90 ఏళ్లు.. సంగెం మండలం గవిచర్ల నివాసి.. భార్య ఆగమ్మ అనారోగ్య సమస్యలతో మంచానికే పరిమితమయ్యారు. తన నాలుగెకరాల భూమిలో 2.5 ఎకరాలను కుమారుడు అక్రమంగా పట్టా చేసుకున్నాడు. మిగిలిన భూమి చెరువు శిఖం కింద ఉంది. గతంలో ఇద్దరు కుమార్తెలకు పసుపు, కుంకుమ కింద 10 గుంటల చొప్పున రాసిచ్చాడు. ఆ భూమిపై కన్నేసిన కుమారుడు తన పేరుపై రాసివ్వాలని ఒత్తిడి తెస్తూ.. తల్లిదండ్రులైన ఇద్దరు వృద్ధులను ఓ చిన్న గదిలో ఉంచి తిండి పెట్టడంలేదు. ఇష్టమొచ్చినట్లు కొడుతున్నాడని కన్నీటి పర్యంతమయ్యారు. తన బాధను గత జులైలో కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.

### గిఫ్ట్ డీడ్ రద్దు చేసి..

పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం పైడిచింతలపల్లి గ్రామానికి చెందిన గడ్డం బాపురెడ్డి కుమారుడైన స్వామిరెడ్డికి 6.5 ఎకరాలను గిఫ్ట్ డీడ్ చేశారు. కాగా, వృద్ధాప్యంలో బాగోగులు చూడడం లేదని.. కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆర్డీవో కుమారుడికి కౌన్సెలింగ్ ఇచ్చారు. అయినా ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో గిఫ్ట్ డీడ్‌ను రద్దుచేయాలని గత ఆగస్టులో దరఖాస్తు చేశారు. కలెక్టర్ పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి గిఫ్ట్‌డీడ్‌ను రద్దుచేసి తిరిగి తండ్రి పేరిట భూమిని బదిలీ చేయాలని అధికారులను ఆదేశించారు. తండ్రి పోషణకు ప్రతి నెలా రూ.10 వేలు చెల్లించాలని కుమారుడిని ఆదేశించారు.

### ఆశ్రమాల్లో ఆదరణ..


నిరాదరణకు గురైన వృద్ధులకు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా అనాథాశ్రమాల్లో సేవలు అందిస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 20 వృద్ధాశ్రమాలు ఉండగా అందులో సుమారు 474 మంది ఉంటున్నారు.

| జిల్లా | ఆశ్రమాలు | వృద్ధుల సంఖ్య |
|---|---|---|
| హనుమకొండ | 10 | 252 |
| వరంగల్ | 05 | 154 |
| జనగామ | 02 | 30 |
| మహబూబాబాద్ | 01 | 12 |
| భూపాలపల్లి | 01 | 10 |
| ములుగు | 01 | 16 |



నగరంలోని వృద్ధాశ్రమంలో వృద్ధులు

### చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి..



-తేరాల యుగంధర్, వయోవృద్ధుల సంక్షేమ సంస్థ కార్యదర్శి

2018లో మేం వయోవృద్ధుల సంక్షేమ సంఘాన్ని స్థాపించాం. జిల్లా స్థాయిలో కలెక్టర్ ఛైర్మన్‌గా ఉన్నారు. చట్టాలపై అవగాహన కల్పిస్తున్నాం. వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నాం. లయన్స్ క్లబ్ సహకారంతో కంటి వైద్య పరీక్షలు చేయిస్తున్నాం. మా పోరాటం వల్లే ఎంజీఎం ఆసుపత్రిలో వృద్ధుల కోసం ప్రత్యేకంగా ఓపీ విభాగం ఏర్పాటు చేశారు.

## అవార్డుల స్ఫూర్తితో అభివృద్ధి




మేయర్ సుధారాణికి ధ్రువపత్రం అందిస్తున్న అధికారులు

**కార్పొరేషన్, న్యూస్‌టుడే:** స్మార్ట్‌సిటీ, నైబర్ హుడ్ ఛాలెంజ్ పోటీల్లో గ్రేటర్ వరంగల్‌కు అవార్డులు రావడం గర్వకారణమని, ఇదే స్ఫూర్తితో అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని మేయర్ గుండు సుధారాణి అన్నారు. ఇటీవల కేంద్ర పట్టణాభివృద్ధి, గృహ నిర్మాణశాఖ ఇచ్చిన 'ఎక్సలెన్స్' ధ్రువపత్రాన్ని సోమవారం రాత్రి బల్దియా ప్రధాన కార్యాలయంలో అధికారులు మేయర్‌కు అందజేశారు. ఎస్‌ఈ ప్రవీణ్ చంద్ర, ఈఈ శ్రీనివాస్, డీఈలు కృష్ణమోహన్, కృష్ణమూర్తి, రంగారావు, ఏఈలు పాల్గొన్నారు.

## యువ పరిశోధకులకు ప్రోత్సాహం



ప్రభాకర్



నరేంద్రకుమార్

**నెల్లికుదురు, న్యూస్‌టుడే:** మిరప పంటను ఆశిస్తున్న నల్లతామర తెగులు నివారణకు పరిశోధనలు చేసి సేంద్రియ ఆధారిత మందులు తయారుచేసిన యువ పరిశోధకులను తెలంగాణ స్టేట్ ఇన్నోవేషన్ సెల్ ద్వారా ప్రభుత్వం అందించే రూ.5 లక్షల టీ-స్పార్క్ గ్రాంట్ వరించింది. వివిధ రంగాల్లో పరిశోధనలు చేస్తున్న వారి నుంచి 2024 ఆగస్టులో అంతర్జాలం ద్వారా ప్రభుత్వం దరఖాస్తులు స్వీకరించింది. మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం శ్రీరామగిరి యువకుడు గాజుల ప్రభాకర్, డోర్నకల్ యువకుడు నరేంద్రకుమార్ ఓయూలో ఎంఎస్సీ పీహెచ్‌డీ పూర్తి చేసి శ్రీజీపీఎవెన్ లైఫ్ సైన్సెస్ అనే స్టార్టప్ సంస్థను స్థాపించి పంటలపై ఆశించే పురుగు, తెగుళ్ల నివారణకు పరిశోధనలు చేస్తున్నారు. హైదరాబాద్ ఐకేపీ నాలెడ్జ్ పార్క్ సహాయంతో త్రిప్ క్లియర్ అనే సేంద్రియ ఆధారిత పురుగు మందు రూపొందించారు. టీ-స్పార్క్ వారు పలుమార్లు పరిశీలించి గ్రాంట్‌కు తమ సంస్థను ఎంపిక చేశారని ప్రభాకర్ 'న్యూస్‌టుడే'కు తెలిపారు. తమ ఉత్పత్తిని త్వరలో మార్కెట్లోకి తీసుకురానున్నట్లు వారు వివరించారు.

## కాలుష్యపు కోరల్లో.. మంచినీళ్ల చెరువు



రైతు బాలయ్య కుడి చేతి సీసాలో స్వచ్ఛమైన నీరు.. ఎడమచేతిలో కలుషితమైన చెరువు నీరు

వరంగల్ జిల్లా రాయపర్తి మండల కేంద్రం శివారులోని 'మంచినీళ్ల చెరువు' కాకతీయుల కాలం నుంచి గ్రామ ప్రజలకు తాగునీటి వరప్రదాయిని. పంట పొలాలకు సాగు నీరు అందించే ప్రధాన జలవనరు. ఒకప్పుడు స్వచ్ఛమైన నీటితో కళకళలాడిన తాటాకం నేడు కోళ్ల పరిశ్రమ వ్యర్థాలతో కాలుష్య కాసారంగా మారింది. సుమారు 115 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న చెరువు కింద 300 ఎకరాల ఆయకట్టు ఉంది. సుమారు 120 మత్స్యకార కుటుంబాలు ఈ చెరువుపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాయి. పదేళ్ల క్రితం వరకు చెరువులో నాణెం వేసినా స్పష్టంగా కనపడేదని స్థానికులు తెలిపారు. తొమ్మిదేళ్ల క్రితం కోళ్ల పరిశ్రమ వెలిసినప్పటి నుంచి మంచినీళ్ల చెరువు కాలుష్యపు కోరల్లో చిక్కుకుంది. పశుపక్ష్యాదులు సైతం ఈ నీటిని తాగలేని పరిస్థితి. గ్రామానికి మంచి నీటిని సరఫరా చేసే బోరు బావులు చెరువులోనే ఉండటంతో.. ఈ నీటిని తాగిన వారు జబ్బుల బారిన పడుతున్నారు. స్నానపానాదులకు ఈ నీటిని వాడినా.. చర్మవ్యాధులతో ఇబ్బంది పడుతున్నారు. కోళ్ల పరిశ్రమ నిర్వాహకులు ఓ కాలువ ద్వారా అర్ధరాత్రి వ్యర్థాలను చెరువులో వదులుతున్నారు. దీనిపై గ్రామస్థులు ఉద్యమం ప్రారంభించారు. గ్రామ పరిరక్షణ కమిటీ పేరిట అధికారులు, ప్రజాప్రతినిధులకు తమ గోడు చెబుతున్నారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో పాలనాధికారి డా.సత్యశారదను కలిసి సమస్య విన్నవించారు.

– ఈనాడు, హనుమకొండ, న్యూస్‌టుడే రాయపర్తి



వరంగల్ కలెక్టరేట్ ఎదుట రాయపర్తి గ్రామ పరిరక్షణ కమిటీ సభ్యులు

### చికెన్ ధరలు

(కిలో వెల రూపాయలలో)

వెన్‌కాబ్

| | |
|---|---|
| ఫాం: | 110 |
| రిటైల్: | 132 |
| డ్రెస్డ్: | 191 |
| స్కిన్‌లెస్: | 218 |

## మేళతాళాలు.. పూల జల్లుల మధ్య ఉపాధ్యాయులకు వీడ్కోలు



**నర్సింహులపేట, న్యూస్‌టుడే:** బదిలీపై వెళుతున్న ఉపాధ్యాయులకు మేళతాళాలు మధ్య పూలు చల్లుతూ, కోలాటాలు వేస్తూ ఆనందోత్సాహాల మధ్య వీడ్కోలు, కొత్తగా వచ్చిన ఉపాధ్యాయులకు స్వాగతం పలికారు నర్సింహులపేట ఆదర్శ పాఠశాల విద్యార్థులు. వారం రోజుల కిందట ఇతర పాఠశాలలకు 18 మంది ఉపాధ్యాయులు బదిలీ అయ్యారు. పదకొండేళ్లపాటు తమకు చదువులు చెప్పిన గురువులకు వీడ్కోలు సమావేశంలో పూలమాలలు వేసి శాలువా, జ్ఞాపికలతో సన్మానించి కన్నీరుమున్నీరయ్యారు. ఇటీవల పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయులను పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ నర్సిరెడ్డి, పూర్వ ప్రిన్సిపల్ ఆనంద్‌బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సెమీస్ చేరిన నల్గొండ, మహబూబ్‌నగర్ జట్లు

**వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే:** ఓరుగల్లు కేంద్రంగా నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి అండర్-19 అంతర్ జిల్లాల క్రికెట్ పోటీలు హోరాహోరీగా జరుగుతున్నాయి. హైదరాబాద్ క్రికెట్ సంఘం(హెచ్‌సీఏ) సహకారంతో వరంగల్ క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీల్లో నల్గొండ, మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లాల జట్లు సెమీస్‌కు చేరాయి. సోమవారం కోమటిపల్లి మైదానంలో వరంగల్, నల్గొండ జట్ల మ్యాచ్ జరిగింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న వరంగల్ జట్టు 16.5 ఓవర్లలో 52 పరుగులకే ఆలౌట్ అయ్యింది. ఛేదనలో నల్గొండ జట్టు 19 ఓవర్లలో 53 పరుగులు చేసి విజయం సాధించింది. నల్గొండ బౌలర్లలో యశ్వంత్ 4 వికెట్లు, శ్రీఖర్ 3 వికెట్లు పడగొట్టి విజయంలో కీలకపాత్ర పోషించారు. మొగిలిచర్ల మైదానంలో మహబూబ్‌నగర్, మెదక్ జట్ల మ్యాచ్ జరిగింది. నిర్ణీత 50 ఓవర్లలో మహబూబ్‌నగర్ జట్టు మూడు వికెట్ల నష్టానికి 217 పరుగులు చేసింది. అభిలాష్ 66 పరుగులు, అబ్దుల్ 54 పరుగులు చేశారు. తర్వాత బాటింగ్‌కు దిగిన మెదక్ జట్టు 32.1 ఓవర్లలో 127 పరుగులకే ఆలౌట్ అయ్యింది. మంగళవారం నుంచి పూల్ 'బి'లోని కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, ఖమ్మం ఉమ్మడి జిల్లాల మ్యాచ్‌లు ఉంటాయని వరంగల్ క్రికెట్ సంఘం కార్యదర్శి చాగంటి శ్రీనివాస్ తెలిపారు.

## అంతర్జాతీయ పారా అథ్లెటిక్స్ క్రీడలకు ఎంపిక

### అడ్డంకిగా మారిన పేదరికం



ప్రతిభకు అవయవలోపం, పేదరికం అడ్డుకాదని నిరూపించారు పలిమెల మండల కేంద్రానికి చెందిన కావేరి జ్యోతి.. అయిదేళ్ల వయసున్నపుడే రోడ్డు ప్రమాదంలో కుడి కాలు కోల్పోయారు. ప్లాస్టిక్ కాలు సాయంతో నడుస్తున్నారు. ప్రస్తుతం హనుమకొండ ప్రభుత్వ కళాశాలలో డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతున్నారు. ఇంటర్ చదువుతున్న సమయంలో జేఎన్ స్టేడియంలో జరిగిన పోటీలను చూసి క్రీడల్లో ఆసక్తి పెంచుకున్నారు. సెప్టెంబరు 1న హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పారా అథ్లెటిక్స్ త్రోబాల్ పోటీల్లో పాల్గొని పసిడి పతకాలు సాధించి జాతీయ స్థాయి ఆటలకు ఎంపికయ్యారు. సెప్టెంబరు 22 నుంచి 26 వరకు ఝార్ఖండ్ రాష్ట్రంలో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో ఆడి అత్యుత్తమ ప్రతిభ కనబర్చారు. అంతర్జాతీయ స్థాయి పారా త్రోబాల్ విభాగంలో ఎంపికయ్యారు. డిసెంబరులో కంబోడియా దేశంలో జరిగే అంతర్జాతీయ ఆటల్లో పాల్గొనేందుకు రూ.లక్ష ఖర్చవుతుందని, అక్టోబరు 15లోపు రూ.50,000 చెల్లిస్తేనే అర్హత పొందుతానని ఆమె తెలిపారు. జ్యోతి తల్లిదండ్రులు వ్యవసాయ కూలీలు కావడంతో రూ.లక్ష సమకూర్చడం భారంగా మారింది. దాతలు ఆర్థికసాయం అందించాలని కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, పలిమెల(భూపాలపల్లి జిల్లా)



## వరికి సుడిదోమ 'పోటు'!



న్యూస్‌టుడే, వరంగల్ వ్యవసాయం

ఉమ్మడి వరంగల్ జిల్లాలో వరి పంటకు సుడిదోమ సోకి తీవ్రంగా నష్టపరుస్తోంది. ఈ సారి 7.50 లక్షల ఎకరాల్లో సాగైనట్లు అంచనా.. ప్రస్తుతం పొట్ట దశలో ఉంది. భారీ వర్షాల తర్వాత వాతావరణం ఉక్కపోతగా మారడంతో సుడిదోమ ఉద్ధృతి పెరిగినట్లు వ్యవసాయ శాస్త్రవేత్తలు గుర్తించారు. తక్షణమే సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మామునూరు కృషి విజ్ఞానకేంద్రం కీటక శాస్త్రవేత్త డా. రాజు, వరంగల్ జిల్లా వ్యవసాయాధికారి కె. అనురాధ రైతులకు సూచించారు. 'పొలాల్లో నీటిపై భాగంలో దోమలు తేలుతూ మొదళ్ల చుట్టూ తిరుగుతూ రసాన్ని పీల్చడంతో ఆకులు పసుపు రంగులోకి మారుతాయి. మొక్క సుడులుగా ఎండిపోతుంది. పొట్ట దశలో ఉద్ధృతి ఎక్కువైతే గింజరాదు. నూకశాతం పెరిగి దిగుబడి పడిపోతుంది. పొలాల్లో తూర్పు, పడమర దిశగా రెండు మీటర్ల దూరంగా పాయలు ఏర్పాటు చేస్తే పంటకు గాలి, వెలుతురు సోకి దోమ ఉద్ధృతి తగ్గుతుంది. పొలంలో నీరు పెడుతూ తీసివేస్తే గుడ్లు, పిల్ల దోమల ఉద్ధృతి తగ్గుతుంది. దోమ కనిపించిన మొదటి దశలో వేపనూనె 1500 పీపీఎం 5 మి.లీ నీటికి కలిపి పిచికారీ చేయాలి. తర్వాత దశలో ట్రైఫ్లుమిజోపైరిమ్ మందును 94 మి.లీ ఎకరానికి పిచికారీ చేయాలి. దోమ ఉద్ధృతి ఎక్కువగా ఉంటే లీటరు నీటికి 1.5 గ్రా. ఎసిఫేట్ 75 ఎస్.పి కలిపి వరి మొదళ్లపై పడేలా పిచికారీ చేయాలి. అప్పటికీ నివారణ కాకపోతే లీటరు నీటికి 0.4 గ్రా. డైనోటెఫ్యూరాన్ 20 ఎస్‌జి లేదా 0.60 గ్రా పైమెట్రోజిన్ 50 డబ్ల్యూజి లేదా ట్రైఫ్లూమెజోపైరిమ్ 0.485 మి.లీ కలిపి పిచికారీ చేయాలి. పొట్ట దశలో యూరియాతో పాటు పొటాష్ కలిపి వేసుకుంటే మొక్కకు రోగనిరోధక శక్తి పెరుగుతుందని' వివరించారు.



దోమ ఉద్ధృతిని పరిశీలిస్తున్న కేవీకే శాస్త్రవేత్త డా.రాజు

రైతేరాజు

## ఉల్లిసాగుకు సమయమిదే...

మెళకువ

**గోపాల్‌పూర్, న్యూస్‌టుడే :** ఉల్లికి మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. వినియోగం పెరగడంతో ధరలు కూడా నిలకడగా ఉంటున్నాయి. సాగులో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకుంటే.. లాభాలు గడించవచ్చని మామునూరు కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డా.రాజు తెలిపారు. 'వర్షాకాలంలో నవంబర్‌లోగా విత్తుకునే అవకాశం ఉంది. ఉల్లి సాగుకు ఎకరాకు మూడు, నాలుగు కిలోల విత్తనాలు అవసరమవుతాయి. నేలను బాగా దున్ని 120 సెం.మీ వెడల్పు, 3 మీటర్ల పొడవైన నారుమళ్లను తయారు చేసుకోవాలి. రెండు కిలోల విత్తనం 200 చ.మీ.ల నారుమడికి సరిపోతుంది. విత్తనశుద్ధి చేయాలి. మూడు గ్రాముల కాప్టాన్ లేదా థైరామ్ కిలో విత్తనానికి కలిపి నారుమడిలో పలచగా వరుసల్లో పోయాలి. నారుకుళ్లు తెగులు సోకకుండా పది రోజులకోసారి కాపర్ ఆక్సీక్లోరైడ్ మూడు గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. నారు పురుగు ఆశించకుండా కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు నారుమడిలో చల్లి నీరు కట్టాలి. నాటిన 75 రోజుల తర్వాత మాలిక్ హైడ్రజైడ్ 2.5 గ్రా. లీటరు నీటికి ద్రావణాన్ని చల్లడం వల్ల మొలక నష్టం బాగా తగ్గుతుంది. నారునాటిన వంద రోజులకు కార్బండిజమ్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేస్తే కుళ్లడం చాలా వరకు తగ్గుతుంది. ఎకరాకు 10 టన్నుల పశువుల ఎరువుతో పాటు 80 కిలోల నత్రజని, 30 కిలోల భాస్వరం, 24 కిలోల పొటాష్ ఎరువులను వేయాలి. వేరుశనగ పిండి లేదా ఆముదపు పిండి వేసి, మట్టిని ఎగదోయడం వల్ల ఎక్కువ దిగుబడి వస్తుంది. నత్రజనిని రెండు దఫాలుగా వేసుకుంటే గడ్డ బాగా ఊరుతుంది. నాటిన 60 రోజుల వరకు 15 రోజుల వ్యవధిలో నాలుగు, అయిదు తడులు ఇవ్వాలి. గడ్డ ఊరే దశలో ఏడు రోజుల వ్యవధిలో ఏడు, ఎనిమిది తడులివ్వాలి. కోతకు 15 రోజుల ముందుగా నీరు కట్టడం ఆపాలి. వానాకాలం ఎకరానికి 80 నుంచి 100 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. యాసంగిలో 130 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చే అవకాశం ఉంటుందని' వివరించారు.



డా.రాజు, శాస్త్రవేత్త, కృషి విజ్ఞాన కేంద్రం, మామునూరు.



దేవన్నపేటలో సాగుచేసిన ఉల్లి

### ప్రశ్న-సమాధానం

? మిరప పంటలో తామర పురుగుల నివారణ చర్యలు తెలపండి..? -వి.బుచ్చిరెడ్డి. దేవన్నపేట

✔ తామర పురుగులు ఆకుల అడుగు భాగాన చేరి రసం పీల్చడంతో పైకి ముడుచుకుంటాయి. దీన్ని నివారించడానికి నాటిన 15, 45, రోజులకు ఎకరాకు 8 కిలోల ఫిప్రోనిల్ గుళికలు తగినంత తేమ ఉన్నప్పుడు వేయాలి. అవసరాన్ని బట్టి ఎసిఫేట్ 1.5 గ్రా. డైమిథియేట్ 2 మి.లీ. లేదా క్లోరోపైరిఫాస్ 2 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

-తిరుపతి, ఉద్యానశాఖ అధికారి, వరంగల్

–న్యూస్‌టుడే, వరంగల్ వ్యవసాయం




తామర పురుగులు ఆశించడంతో ముడుచుకుపోయిన మిరప మొక్కలు

## గులాబీ.. లాభాల గుబాళింపు



**ఎల్కతుర్తి, న్యూస్‌టుడే :** మెట్ట ప్రాంతంలో గులాబీ తోట సాగుచేసి కొంత మంది కూలీలకు ఉపాధి కల్పిస్తూ లాభాలు పొందుతున్నారు. మండంలోనే గులాబీ తోట సాగు చేసి ఆదర్శంగా నిలిచారు.. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండలం సిర్లపల్లి గ్రామానికి చెందిన రైతు తూముల చక్రధర్‌రావు సుమారు పదేళ్ల కిందట హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం జీల్గుల గ్రామంలో రెండెకరాల భూమి కొనుగోలు చేశారు. అందులో వ్యవసాయం చేస్తున్నాడు. ఎకరంలో వరి, పత్తి సాగు చేశాడు. మిగతా ఎకరంలో సుమారు రూ.4 లక్షలు పెట్టుబడి పెట్టి ఏడాది క్రితం గులాబీ తోట సాగు చేశారు. నెల నుంచి పువ్వులు దిగుబడి తీస్తున్నారు. వారంలో రెండు సార్లు కోసి విక్రయిస్తున్నారు. చెట్లకు మూడు రోజులకోసారి 40 నుంచి 50 కిలోల పూలు పూస్తున్నాయి. ప్రస్తుతం మార్కెట్‌లో కిలో రూ.80 నుంచి రూ.100 వరకు ధర ఉంది. తోట వద్దకు వచ్చేవారికి రూ.100కు కిలో చొప్పున విక్రయిస్తున్నారు. రైతు చక్రధర్ మాట్లాడుతూ... నెల రోజులుగా పూలు పూస్తున్నాయి. పండగల వేళల్లో ధర ఎక్కువగా ఉంటుంది. వ్యవసాయాధికారుల సూచన మేరకు సస్యరక్షణ చేపడుతున్నాం.. మొక్కలకు దిగుబడి అనంతరం కొమ్మల కత్తిరింపు చేపడుతూ.. పదేళ్ల వరకు పూల దిగుబడి పొందవచ్చని వివరించారు.



చక్రధర్‌రావు




శ్యామలా దుర్గాదాస్ కాలనీలో పార్కులో అధికారులకు సూచనలిస్తున్న పశ్చిమ ఎమ్మెల్యే నాయిని

## పార్కుల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు

**గోపాలపూర్, న్యూస్‌టుడే:** హనుమకొండలోని పార్కులను పరిరక్షించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం హనుమకొండలోని దుర్గాదాస్ శ్యామల కాలనీలోని పబ్లిక్ పార్కును కార్పొరేషన్ అధికారులు, కాలనీ ప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. పార్కు భూమిని కొందరు ఆక్రమించిన్నట్లు కాలనీవాసులు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. దీంతో పార్కును పరిశీలించి హద్దులు నిర్ణయించి రక్షణ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. పార్కు ఆవరణలో విద్యుత్తు దీపాలు, చుట్టూ సీసీ కెమెరాలతో పాటు వాచ్‌మెన్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. కాలనీ మహిళలు పార్కులో బతుకమ్మ ఆడుకునేందుకు తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్ రవీందర్‌గౌడ్, ఉద్యాన శాఖ అధికారి రమేష్, కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్, వీరబ్రహ్మాచారి, శంకరాచారి, రమేష్, ప్రసాద్, సుధాకర్ పాల్గొన్నారు.

# అర్జీలు స్వీకరించి.. సమస్యలు ఆలకించి


అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి

**హనుమకొండ కలెక్టరేట్, న్యూస్‌టుడే:** ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజలు అందించే వినతులకు పరిష్కార మార్గం చూపాలని అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు ప్రజావాణి నిర్వహించారు. అదనపు కలెక్టర్‌తో పాటు డీఆర్వో గణేష్, ఆర్డీవోలు వెంకటేష్, నారాయణ వినతులను స్వీకరించారు. మొత్తం 158 దరఖాస్తులు వచ్చాయి. భూ సమస్యలు, వ్యక్తిగత, సామూహిక సమస్యలు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, రుణ సదుపాయాలు కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... అధికారులు శాఖల వారీగా సమస్యలను పరిశీలించాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లాలోని వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

### పింఛను అందించండి

**-కంది సాంబరెడ్డి**



హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలం చౌలపల్లికి చెందిన కంది సాంబరెడ్డి పుట్టుకతో బోదకాలుతో బాధపడుతున్నాడు. తరుచూ అనారోగ్యానికి గురవుతున్నాడు. అతడి ఇద్దరు ఆడపిల్లలు, భార్య సుగుణ కూలీ పని చేస్తేగానీ పూట గడవని పరిస్థితి. ప్రభుత్వం దివ్యాంగుల పింఛను అందించి ఆర్థికంగా చేయూత ఇవ్వాలని కోరుతున్నాడు. గ్రామ కార్యదర్శి, మండల పరిషత్ కార్యాలయంలో దరఖాస్తులు అందించినా ప్రయోజనం లేదన్నాడు. ప్రజావాణిలో రెండు సార్లు అర్జీ అందించినట్లు ఆవేదన వ్యక్తం చేశాడు.

### ఆసరా అందించి ఆదుకోరూ....

**- చిట్యాల నర్సింగరావు, కొత్తపల్లి, కాజీపేట మండలం**



కొత్తపల్లి హవేలీ, భట్టుపల్లికి చెందిన చిట్యాల నర్సింగరావు నరాల బలహీనతతో నిలబడలేని పరిస్థితి. బరువు మోయలేడు. తమ కుటుంబ ఆసరాకు పింఛను ఇప్పించాలని ప్రజావాణికి వచ్చాడు. చాలా ఏళ్లుగా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నానని, ఇప్పుడు నా వయస్సు 64 ఏళ్ల అని, కనీసం వృద్ధాప్య పింఛనైనా ఇప్పిస్తే ఆసరాగా ఉంటుందని.. కలెక్టర్ స్పందించి పింఛను అందించాలని కోరాడు.

### దివ్యాంగుల పింఛను పునరుద్ధరించండి

**- పల్లెబోయిన మల్లయ్య, కంటాత్మకూరు, నడికుడ మండలం**



కంటాత్మకూరుకు చెందిన పల్లెబోయిన మల్లయ్యకు పక్షవాతం వచ్చి నడవలేడు. భార్య పిల్లలు కూలీ పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. పక్షవాతం వచ్చిన తర్వాత ఆరోగ్య పరీక్షలు నిర్వహించి దివ్యాంగుల పింఛను మంజూరు చేశారు. నాలుగేళ్లకు పైగా అందించారు. ఏడాది కాలంగా రావడం లేదు. కారణం తెలియక అన్ని కార్యాలయాలు తిరిగాను. అధికారులు స్పందించి రద్దు చేసిన పింఛన్ తిరిగి పునరుద్ధరించాలని దరఖాస్తు సమర్పించారు.



## వితంతువుల పిల్లలకు ఆర్థిక సాయం


బాలవికాస అందించిన సంచులతో విద్యార్థులు

**కాజీపేట, న్యూస్‌టుడే:** వితంతువులు, వారి పిల్లలకు, అనాథలకు బాలవికాస రూ.17లక్షల ఆర్థిక సాయం అందించింది. ఫాతిమానగర్‌లోని సంస్థ శిక్షణ కేంద్రంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు మర్రెడ్డి, ప్రోగ్రాం మేనేజర్ లత 80 మంది వితంతువులకు, 184 మంది పిల్లలకు ఆర్థికసాయం, 284 నిత్యావసరాలు పంపిణీ అందించారు. సోఫార్ సంస్థ సౌజన్యంతో ఏటా దసరా, బతుకమ్మ పండగలకు ముందుగా ఆర్థిక సాయం చేస్తున్నట్లు మేనేజర్ లత తెలిపారు. కార్యక్రమంలో మహిళాభివృద్ధి పథకం సమన్వయకర్తలు జ్యోతి, సుజాత, అమూల్య పాల్గొన్నారు.

## దరఖాస్తుల ఆహ్వానం

**ముచ్చర్ల (హసన్‌పర్తి), న్యూస్‌టుడే:** హసన్‌పర్తి మండల కేంద్రంలోని భారతీయ స్టేట్ బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఉమ్మడి వరంగల్ జిల్లాల్లోని నిరుద్యోగ అభ్యర్థుల నుంచి ఉమెన్స్ టైలర్, బ్యూటీ పార్లర్, మగ్గం వర్క్ ఉచిత శిక్షణకు దరఖాస్తులను కోరుతున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ బాస రవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హనుమకొండ, వరంగల్, మహబూబాబాద్, జనగామ, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలకు చెందిన 18 నుంచి 45 ఏళ్లలోపు వయసు కలిగి తెలుగు చదవడం, రాయడం వచ్చి ఉండాలన్నారు. రేషన్ కార్డు కలిగి ఉండాలని సూచించారు. దరఖాస్తుదారులు ధ్రువపత్రాలు జిరాక్స్‌తో అక్టోబర్ 10లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 9704056522, 9849307873, 9949108934, 6281260878 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

## వేర్వేరు దాడి ఘటనల్లో కేసులు నమోదు

**చింతగట్టు (భీమారం), న్యూస్‌టుడే:** మద్యం పర్మిట్ రూంలో మూత్ర విసర్జన చేశారని దాడి చేసిన ఘటనలో సోమవారం కేసు నమోదైనట్లు హసన్‌పర్తి ఎస్సై దేవేందర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. హసన్‌పర్తికి చెందిన రాజ్‌కుమార్ అతడి మిత్రుడు వినయ్ కలిసి ఆదివారం రాత్రి స్థానిక వైన్స్ దుకాణంలో మద్యం కొనుగోలు చేసి పర్మిట్ రూం తాగారు. పర్మిట్ రూం వ్యక్తులు వచ్చి గోడపై మూత్ర విసర్జన ఎందుకు చేస్తున్నావంటూ రాజ్‌కుమార్‌పై దాడి చేశారు. అడ్డుకున్న వినయ్‌పై దాడి చేశారు. బాధితుడు రాజ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

**చింతగట్టు(భీమారం) :** ఇంటి ముందు ఉన్న చెట్లు విషయంలో వ్యక్తిపై దాడి చేసిన ఘటనపై హసన్‌పర్తి పోలీసు స్టేషన్‌లో సోమవారం కేసు నమోదైనట్లు ఎస్సై దేవేందర్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. అనంతసాగర్‌కు చెందిన సురేశ్ అనే వ్యక్తి ఇంటి ముందు ఉన్న చెట్లను ఆదివారం అదే గ్రామానికి చెందిన సుమన్ ట్రాక్టర్ డోజర్‌తో నెడుతుండగా తమ చెట్లను ఎందుకు విరుస్తున్నావని అడగడంతో సురేశ్‌పై సుమన్ దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## బాలల సంరక్షణ అందరి బాధ్యత



సమావేశంలో మాట్లాడుతున్న సైబర్ క్రైం ఏసీపీ విజయకుమార్, తదితరులు

**సుబేదారి, న్యూస్‌టుడే:** బాలల సంరక్షణ బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని వరంగల్ సైబర్ విభాగం ఏసీపీ కె. విజయకుమార్ అన్నారు. సోమవారం సుబేదారి ఆసంత్ భవన్‌లో ఎఫ్‌ఎంఎం సామాజిక సేవా సంస్థ, బాలల సంరక్షణ విభాగం, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో బాలల సంరక్షణకు చేపట్టాల్సిన అంశాలపై అవగాహన సదస్సు జరిగింది. కార్యక్రమానికి విజయకుమార్ ముఖ్య అతిథిగా హాజరైన మాట్లాడారు. బాలల సంరక్షణ కోసం పనిచేస్తున్న స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వ విభాగాలు సమన్వయంతో పనిచేస్తూ వారి హక్కులను కాపాడాలన్నారు. బాలలపై జరుగుతున్న నేరాలు ఆందోళన కలిగిస్తున్నట్లు తెలిపారు. హనుమకొండ బాలల సంరక్షణ సమితి ఛైర్మన్ అన్నమనేని అనిల్ చందర్ రావు, వసుధ, డాక్టర్ నాగవాణి, సంతోష్‌కుమార్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

## ఉత్సాహంగా అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు


400 మీటర్ల పరుగులో బాలికలు (హనుమకొండ జిల్లా)

**వరంగల్ క్రీడా విభాగం, న్యూస్‌టుడే:** హనుమకొండ అథ్లెటిక్స్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు సోమవారం జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఉత్సాహంగా జరిగాయి. పోటీలకు హనుమకొండ, వరంగల్ జిల్లాలకు చెందిన అథ్లెట్లు హాజరయ్యారు. వివిధ క్రీడా శాఖల్లో అండర్-14, 16, 18, 20 విభాగాల్లో జరిగిన పోటీలకు అథ్లెట్లు విజయం కోసం చెమటోడ్చారు. ముఖ్యఅతిథిగా టాస్క్‌ఫోర్సు సీఐ రాజు హాజరై పోటీలను ప్రారంభించారు. ఎంపికైన అథ్లెట్లు అక్టోబరు 26 నుంచి 29 వరకు భువనేశ్వర్‌లో జరిగే జూనియర్ నేషనల్స్ ఛాంపియన్‌షిప్-2024లో పాల్గొంటారని హనుమకొండ అథ్లెటిక్స్ సంఘం కార్యదర్శి సారంగపాణి తెలిపారు. వరంగల్ జిల్లా అథ్లెటిక్స్ సంఘం కార్యదర్శి యుగేంధర్‌రెడ్డి, మనోజ్‌కుమార్, శ్రీమన్నారాయణ, సాంబమూర్తి, కృష్ణమూర్తి, మహేందర్, సురేష్ పాల్గొన్నారు.

## నందీశ్వరుడికి అభిషేకం



**ఐనవోలు, న్యూస్‌టుడే:** చారిత్రక శైవక్షేత్రం ఐనవోలు మల్లికార్జున స్వామి ఆలయంలో నందీశ్వర స్వామికి సోమవారం మహా అభిషేకం చేశారు. వేద పండితులు, అర్చకులు ప్రదోష కాలంలో నందీశ్వరుడిని రంగురంగుల పూలతో అలంకరించారు. నందికి శాస్త్రోక్తంగా పూజలు చేసి పంచామృతాలతో అభిషేకం చేశారు. అంతకు ముందు స్వామివారికి రుద్రహోమం, రుద్రాభిషేకం జరిపించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. దేవస్థాన ఉప ప్రధాన అర్చకుడు రవీందర్ మాట్లాడుతూ.. గ్రహదోషాలు, సంతాన ఫలితాలు, వివాహ దోషాలు తొలగిపోతాయని భక్తులు ఈ పూజల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. ఈవో అద్దంకి నాగేశ్వర్‌రావు, జూనియర్ అసిస్టెంట్ కిరణ్, ముఖ్య అర్చకులు మధుకరశర్మ, శ్రీనివాస్, వేదపండితులు పురుశోత్తమశర్మ, వినాయక జోషి, అర్చకులు నరేష్‌శర్మ, భాను, మధుశర్మ ఉన్నారు.

## ముగిసిన కేయూ ఇంటర్ కాలేజియేట్ టోర్నమెంటు



విజేతలకు బహుమతి అందజేస్తున్న కేయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ ప్రొ. వై.వెంకయ్య, తదితరులు

**ముచ్చర్ల (హసన్‌పర్తి), న్యూస్‌టుడే:** హనుమకొండ హసన్‌పర్తి మండలం భీమారంలోని కిట్స్ ఇంజినీరింగ్ కళాశాల క్రీడా మైదానంలో రెండు రోజులుగా జరుగుతున్న కేయూ ఇంటర్-కాలేజియేట్ పురుషుల టోర్నమెంటు (ఫేజ్-1) సోమవారం ముగిశాయి. జిల్లా యువజన, క్రీడశాఖ అధికారి జి.అశోక్ విజేతలకు బహుమతులు, ధ్రుపత్రాలు అందజేశారు. యువత తమ ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు క్రీడలపై దృష్టి పెట్టాలని సూచించారు. గెలుపు, ఓటములు సహజమని, గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. గౌరవ అతిథి కేయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ ప్రొ. వై.వెంకయ్య మాట్లాడుతూ కాకతీయ విశ్వ విద్యాలయం పరిధిలోని ఆదిలాబాద్, ఖమ్మం, ఉమ్మడి వరంగల్ జిల్లాల నుంచి 34 కళాశాలలకు చెందిన 800 మంది క్రీడాకారులు టోర్నమెంట్స్‌లో పాల్గొనడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కిట్స్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ అశోక్‌రెడ్డి, ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రొ. పింగిళి రమేశ్‌రెడ్డి, డాక్టర్ ఏటీబీటీ ప్రసాద్, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటస్వామి, మహేశ్, నాగరాజు, ప్రభాకరాచారి తదితరులు పాల్గొన్నారు.

### విజేతలు వీరే..

కేయూ ఇంటర్-కాలేజియేట్ పురుషుల టోర్నమెంటు (ఫేజ్-1) పోటీల్లో విజేతల వివరాలను ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ పింగిలి రమేశ్‌రెడ్డి వెల్లడించారు.

- బ్యాడ్మింటన్‌లో హనుమకొండకు చెందిన వాగ్దేవి డిగ్రీ అండ్ పీజీ కళాశాల విద్యార్థులు కిట్స్ వరంగల్ జట్టుపై విజయం సాధించారు.
- బాస్కెట్‌బాల్‌లో యూసీపీఈ కేయూ జట్టు-కిట్స్ వరంగల్ జట్టుపై గెలుపొందింది.
- చెస్ పోటీల్లో కిట్స్ వరంగల్ జట్టు-టీజీటీఎస్‌డబ్ల్యూఆర్‌డీసీ సైనిక్ స్కూల్‌పై విజయం సాధించింది.
- ఫుట్‌బాల్‌లో కిట్స్ వరంగల్ జట్టు-కేయూ జట్టుపై విజయం సాధించారు.

టేబుల్ టెన్నిస్‌లో కిట్స్ వరంగల్ జట్టు-కేయూ జట్టుపై గెలుపొందింది.

వాలీబాల్ పోటీల్లో టీటీడబ్ల్యూఆర్‌డీ మామునూర్ జట్టు-టీటీడబ్ల్యూఆర్‌డీసీ ఆదిలాబాద్ జట్టుపై గెలుపొందింది.

## ఫీజులు విడుదల చేయాలని ఆందోళన

**సుబేదారి, న్యూస్‌టుడే:** పెండింగ్ ఫీజు బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని కోరుతూ సోమవారం డీఎంఎస్‌ఏ, టీఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సుబేదారి ఆర్ట్స్ కళాశాల నుంచి హనుమకొండ కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా టీఎస్ఎఫ్ విద్యార్థి సంఘం నాయకుడు కన్నం సునీల్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగాన్ని పూర్తిగా నిర్వినియోగం చేసిందన్నారు. విద్యాశాఖకు నిధులు కేటాయించడంలో విఫలమైందన్నారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు దూడపాక నరేష్, వంశీ, ఠాగూర్, మల్లేష్, దామోదర్, విద్యార్థులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు

**భీమదేవరపల్లి, న్యూస్‌టుడే:** ములుకనూర్‌లో మాజీ ఎమ్మెల్యే సతీష్ కుమార్ జన్మదిన వేడుకలను సోమవారం భారాస మండలాధ్యక్షుడు సురేందర్ ఆధ్వర్యంలో భారాస శ్రేణులు ఘనంగా నిర్వహించారు. మాజీ జడ్పీఛైర్మన్ సుధీర్‌కుమార్ కేక్ కోసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు అనిత, సంపత్, మహిళా మండల అధ్యక్షురాలు ఏనుగు సత్యవతి, సర్పంచుల ఫోరం మాజీ మండలాధ్యక్షుడు రాజిరెడ్డి, నాయకులు సదానందం, జయంత్, రజనాచారీ, పూర్ణచందర్, వినయ్, రవీందర్, సంపత్, రాజు, సుధాకర్ పాల్గొన్నారు.

## చికిత్స పొందుతూ యువకుడి మృతి

**చింతగట్టు(భీమారం), న్యూస్‌టుడే:** పెళ్లి కావడం లేదని మనస్తాపం చెంది యువకుడు పురుగు మందు తాగి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన హసన్‌పర్తిలో చోటుచేసుకుంది. ఎస్సై దేవేందర్ కథనం ప్రకారం.. హసన్‌పర్తికి చెందిన పవన్ అరవింద్ (26) ప్రైవేట్ బస్సు డ్రైవర్‌గా పని చేస్తున్నారు. అతడికి పెళ్లి కావడం లేదని ఈ నెల 12న పురుగు మందు తాగాడు. కుటుంబ సభ్యులు గుర్తించి ఎంజీఎం తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

**దామెర, న్యూస్‌టుడే:** చికిత్స పొందుతూ ఒకరు మృతి చెందిన సంఘటన సోమవారం జరిగింది. ఎస్సై అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన జనగాం రమేష్(35) మానసిక స్థితి సరిగ్గా లేదు. దీంతో ఆయన కుటుంబ సభ్యులు దామెర మండలం ఒగ్లాపూర్‌లోని సైలానిబాబా దర్గాకు సెప్టెంబరు 26న తీసుకొచ్చారు. అదే రోజు రాత్రి రమేష్ దర్గాలోని ఓ గదిలో ఉరివేసుకొని ఆత్మహత్యకు యత్నించగా చికిత్స కోసం ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సెప్టెంబరు 29న మృతి చెందాడు. మృతుడి భార్య కౌసల్య ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.





## వేయిస్తంభాల ఆలయంలో స్వచ్ఛత హీ సేవా

**హనుమకొండ చౌరస్తా, న్యూస్‌టుడే:** మై భారత్ (నెహ్రూ యువ కేంద్ర) ఆధ్వర్యంలో హనుమకొండలోని చారిత్రక రుద్రేశ్వర వేయిస్తంభాల దేవాలయంలో సోమవారం స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. మై భారత్ జిల్లా అధికారి అన్వేష్ చింతల, సీపీఆర్‌వో శ్రీధర్, కేంద్ర పురావస్తు శాఖ అధికారి మల్లేశం ముఖ్య అతిథులుగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. భక్తులకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. సుమతిరెడ్డి కళాశాల విద్యార్థినులు ఆలయం చుట్టూ శుభ్రం చేశారు. అనంతరం విద్యార్థినులకు మై భారత్ పుస్తకాలను అందించారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

## కనీస వసతులు కరవు

**సుబేదారి, న్యూస్‌టుడే:** పింగిళి కళాశాలలో కనీస మౌలిక వసతులు లేవని భాజపా జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ అన్నారు. సోమవారం కళాశాలను సందర్శించి వసతులను పరిశీలించారు. పలు అంశాలను ప్రిన్సిపల్ దృష్టికి తీసుకెళ్లారు. కళాశాలల్లో అధ్యాపకుల పోస్టులు ఖాళీగా ఉన్నాయని, విద్యార్థినులకు అవసరమైన గదులు లేవన్నారు. మరుగుదొడ్లు లేవన్నారు. ప్రభుత్వం సమస్యలను పరిష్కరించాలని లేదంటే ఆందోళనలు చేస్తామన్నారు. భాజపా నాయకులు జన్ను మధు, సతీష్, మహేందర్, అమృతరావు, అమరేందర్ రెడ్డి, రాజేశ్, శివరాం తదితరులున్నారు.

## దేశభక్తి సమానత్వానికి జాషువా కృషి

**సుబేదారి, న్యూస్‌టుడే:** ప్రజల్లో దేశభక్తి, సమానత్వాన్ని పెంపొందించే దిశగా జాషువా అద్భుతమైన సాహిత్యాలను సృష్టించాడని సాహితివేత్త గిరిజా మనోహర్ బాబు అన్నారు. సోమవారం సుబేదారి ఆర్ట్స్ కళాశాల తెలుగు విభాగాధిపతి కర్రె సదాశివుడి అధ్యక్షతన జాషువా సమాలోచన కార్యక్రమానికి గిరిజా మనోహర్ బాబు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గాంధీ, అంబేడ్కర్ సిద్ధాంతాలను అనుసరిస్తూ భారతీయ సంస్కృతిని గౌరవిస్తూ కవిత్వం రాశారన్నారు. పాట, కవిత్వం ప్రజలను చైతన్యవంతులను చేస్తోందని ప్రిన్సిపల్ ఆచార్య జ్యోతి అన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ పుల్లా రమేష్, అధ్యాపకులు మామిడి లింగయ్య, రాజ్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

## జాతీయ వన్యప్రాణి వారోత్సవాలు

**న్యూశాయంపేట, న్యూస్‌టుడే:** జాతీయ వన్యప్రాణి వారోత్సవాల్లో భాగంగా అక్టోబర్ 2 నుంచి 8 వరకు ఓరుగల్లు వైల్డ్ లైఫ్ సొసైటీ, పర్యావరణ పరిరక్షణ ఐక్య వేదిక సంయుక్తంగా పలు కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు పర్యావరణ పరిరక్షణ వేదిక అధ్యక్షుడు కాజీపేట పురుషోత్తం, ఓరుగల్లు వైల్డ్ లైఫ్ సొసైటీ అధ్యక్షుడు నాగేశ్వరరావులు సంయుక్త ప్రకటనలో తెలిపారు. 2న ఫారెస్ట్ ఆఫీస్, కలెక్టర్ ఆఫీస్ నుంచి కడిపికొండ, హంటర్‌రోడ్డు జూపార్కు మీదుగా పబ్లిక్ గార్డెన్ వద్ద పోస్టర్, కరపత్రాల ఆవిష్కరణ. 3న ఫారెస్ట్ క్యాంపు (గంగారం మడగూడ అడవిలో), 4న ఫారెస్ట్ వాక్, బర్డ్ వాక్ మడగూడ, 5న హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లోని నేరెళ్ల వేణుమాధవ్ ప్రాంగణంలో జిల్లా స్థాయి క్విజ్, చిత్రలేఖనం, ఉపన్యాస, వ్యాసరచన పోటీలు (అంశం: వన్యప్రాణుల పరిరక్షణ సామాజిక బాధ్యత), కవి గాయక సమ్మేళనం 'వన్యం జీవ కారుణ్యం' అంశంపై కవితలు, పాటలు వైల్డ్ లైఫ్ ఫోటో గ్యాలరీ నిర్వహణ, స్నేక్ షో, 6న. అమ్మవారిపేట సందర్శన ఫోటోగ్రఫీ, 7న వెట ల్యాండ్ క్లీనప్ డ్రైవ్ (చిత్తడి నేలల పరిరక్షణ, సరస్సుల పరిరక్షణలో భాగంగా సరస్సులు, చెరువుల వద్ద చెత్త తొలగింపు, 8న. హంటర్‌రోడ్డులోని కాకతీయ జూపార్కులో ముగింపు సందర్భంగా అటవీశాఖ జిల్లా అధికారితో బహుమతుల ప్రధానోత్సవం నిర్వహించనున్నారు.

## జూద కేంద్రాలపై టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడి

**వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే:** నగరంలోని కాకతీయ విశ్వవిద్యాలయం ఠాణా పరిధిలోని రెడ్డికాలనీలో, స్టేషన్‌ఘన్‌పూర్ ఠాణా పరిధిలోని సముద్రాలలో జూద కేంద్రాలపై సోమవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేశారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ ఎ.మధుసూదన్ కథనం మేరకు... రెడ్డికాలనీలో ఇంట్లో జూదం ఆడుతున్నట్లు సమాచారం రావడంతో స్థానిక పోలీసులతో కలిసి దాడి చేయగా ఆరుగురు వ్యక్తులు పట్టుబడ్డారు. రూ.20,820 నగదు, సముద్రాలల్లో తొమ్మిది మంది పట్టుబడ్డారు. వారి నుంచి రూ. 46,350 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు విచారణ కోసం ఆయా ఠాణాలకు అప్పగించామని తెలిపారు.

## గ్రామస్థులకు వైద్య పరీక్షలు

**కమలాపూర్, న్యూస్‌టుడే:** కమలాపూర్‌లో పుల్లా ఫ్యామిలీస్ ఆధ్వర్యంలో సోమవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా సైబరాబాద్ ఎస్‌వోటీ అదనపు డీసీపీ పుల్లా శోభన్‌కుమార్ హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్నారు. 900 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. విశ్రాంత అదనపు ఎస్పీ పి.సంజీవ రావు, స్థానిక సీ.ఐ. హరికృష్ణ, ఎంపీడీవో బాబు, నిర్వాహకులు పుల్ల కొమురయ్య, రామస్వామి, శ్రీను, శంకర్, వినోద్‌కుమార్, శోభన్‌బాబు, పుల్లా కుటుంబీకులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ విద్యాసంస్థల విద్యార్థులే ప్రగతి చోదకులు



దుస్తులు పంపిణీ చేసిన జీఎస్టీ జాయింట్ కమిషనర్ శ్రీలీల

**ధర్మసాగర్, న్యూస్‌టుడే:** ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదువుకునే విద్యార్థులే రేపటి ప్రగతి చోదకులని జీఎస్టీ రాష్ట్ర జాయింట్ కమిషనర్ ఎడ్ల శ్రీలీల అన్నారు. ధర్మసాగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం విద్యార్థినులకు బతుకమ్మ దుస్తులను అందించారు. విద్యార్థులకు రూ. 50 వేల విలువ గల దుస్తులను పంపిణీ చేశారు. సమావేశంలో కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్, అధ్యాపకులు ఆజామ్, బాబురావు, వెంకట్, ప్రభాకర్ గోపాలకృష్ణ, గణేష్, మంజుల, సదానందం, లావణ్య, ముత్తయ్య పాల్గొన్నారు.

## గౌడ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా రాజయ్య

**కాజీపేట రూరల్, న్యూస్‌టుడే:** తెలంగాణ గౌడ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా కడిపికొండకు చెందిన నాగపురి రాజయ్యగౌడ్‌ను నియమిస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు బోనగాని యాదగిరిగౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. గౌడ కుల అభివృద్ధికి రాజయ్య చేస్తున్న సేవలను గుర్తించి జిల్లా కార్యవర్గంలో సముచిత స్థానం కల్పించినట్లు ఆయన పేర్కొన్నారు.

## సర్వే ప్రారంభం

**ధర్మసాగర్, న్యూస్‌టుడే:** 'చెరువులోనే భవనం..' శీర్షికతో సెప్టెంబర్ 27న ఈనాడులో ప్రచురితమైన కథనానికి రెవెన్యూ శాఖ, దేవాదుల ఎత్తిపోతల పథకం అధికారులు స్పందించి పరిశీలించిన విషయం విధితమే. సోమవారం ఆ ఇల్లును ఎక్కడ నిర్మించారని తేల్చడానికి ధర్మసాగర్ రిజర్వాయర్ శివారులోని ఎలుకుర్తి, ముప్పారం, ధర్మసాగర్ శివారుల్లో కలిసే సర్వే నెంబర్ల పాయింట్ హద్దులను పరిశీలించారు. మొదటి రోజు మూడు గ్రామాల పరిధిలోని హద్దులతో పాటు ముఖ్యమైన హద్దులను వెతికారు. చెరువులో కొన్ని హద్దు రాళ్లు మునిగిపోవచ్చని సర్వే అధికారులు అభిప్రాయపడ్డారు. మొదటి రోజు కొన్ని పాయింట్లను తీసుకున్నారు. మూడు రోజుల్లో పూర్తి చేస్తామని సర్వేయర్ సురేందర్ తెలిపారు. ఆర్ఐ కిరణ్, దేవాదుల అధికారులు డీఈఈ ప్రశాంతి, ఏఈ అరవింద్ పాల్గొన్నారు.

## గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలి

**కాజీపేట టౌన్, న్యూస్‌టుడే:** ప్రభుత్వ వైద్య ఆరోగ్యశాఖ మండలంలోని అన్ని గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి ప్రజలకు సేవలందించాలని సీపీఎం కాజీపేట మండల ఇన్‌ఛార్జి కార్యదర్శి ఓరుగంటి సాంబయ్య డిమాండ్ చేశారు. కాజీపేటలో సోమవారం నిర్వహించిన సీపీఎం మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నాయకులు రమేశ్, ఇందిరా, అనిత, రాజేష్ పాల్గొన్నారు.

## జాతర భూమి ఆక్రమణపై ఫిర్యాదు

**కమలాపూర్, న్యూస్‌టుడే:** కమలాపూర్ శివారులోని సమ్మక్క గుట్ట వద్ద జాతరకు సంబంధించిన సీలింగ్ భూమిలో మామిడి మొక్కలు నాటి ఎకరాల కొద్ది కబ్జా చేస్తున్నారని సమ్మక్క, సారక్క జాతర కమిటీ ఛైర్మన్ ఆన్‌కార్ అశోక్, కమిటీ సభ్యులు మౌటం రాజు, చంద్ర శేఖర్, కోడెపాక రవి, కొలుగూరి కుమార్, ప్రసాద్, సాంబయ్య సోమవారం కమలాపూర్ తహసీల్దారు సురేశ్ కుమార్‌కు ఫిర్యాదు చేశారు. ఈజీఎస్ పనుల కింద జాతర కమిటీ పాలక సభ్యులు మొక్కలను నాటిస్తే వాటిని తొలగించి మామిడి మొక్కలు నాటి భూమిని చదును చేస్తున్నారని ఆరోపించారు. చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

## విద్యార్థులకు అభినందన


విజేతలతో ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి

**పరకాల, న్యూస్‌టుడే:** జాతీయస్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ కనబర్చిన పరకాలకు చెందిన విద్యార్థులను సోమవారం ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి అభినందించారు. హనుమకొండలో ఆదివారం జరిగిన పోటీల్లో స్థానిక క్రియేటివ్ కరాటే-డూకు చెందిన విద్యార్థులు మాన్యశ్రీ, జాశ్విక, జి. ఆదిత్య, షణ్ముఖ, చేతన్ బంగారు పతకాలు సాధించారు. కరాటే-డూ అధ్యక్షుడు మాడ సంపత్, కాంగ్రెస్ నాయకుడు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## నగదు పురస్కారాలు అందజేత

**ఆత్మకూరు, న్యూస్‌టుడే:** ఆత్మకూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో 2023-24 విద్యా సంవత్సరంలో పదో తరగతిలో అధిక జీపీఏ సాధించిన విద్యార్థులకు సోమవారం 1992-1993లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు రూ.10 వేల నగదు పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని పుల్ల నిర్మలకుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## గంజాయి పట్టివేత

**శాయంపేట, న్యూస్‌టుడే:** శాయంపేట మండలం పత్తిపాక శివారులో సోమవారం గంజాయిని పట్టుకున్నట్లు ఎస్సై ప్రమోద్‌కుమార్ తెలిపారు. పత్తిపాక శివారులోని పెద్దగుట్ట వద్ద జయశంకర్ భూపాలపల్లి జిల్లా గోరికొత్తపెల్లికి చెందిన పల్లెబోయిన రాకేష్, వైనాల తిరుపతి, పరకాలకు చెందిన జన్ను సాయి కృష్ణ, రౌతు అన్వేష్‌కుమార్, అల్లె రాజేష్, శాయంపేట మండలం సూర్యనాయక్‌తండాకు చెందిన జర్పుల సురేష్‌ల వద్ద 2 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకొని కేసునమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

## పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం


సీమంతం నిర్వహిస్తున్న అధికారులు

**దామెర:** పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాణి అన్నారు. కోగిల్వాయిలో సోమవారం పోషణ మాసోత్సవంలో భాగంగా గర్భిణులకు సీమంతం నిర్వహించారు. బాలింతలు, పిల్లలు, గర్భిణులు పోషకాహారం తీసుకోవాలని సూచించారు. హెల్త్ సూపర్‌వైజర్ అశోక్‌బాబు, ఏఎన్ఎం సౌందర్య, ఉపాధ్యాయిని రాధిక తదితరులు పాల్గొన్నారు.

**పరకాల నియోజకవర్గం**

## ఉద్యోగ జీవితం మరపురానిది

**దామెర, న్యూస్‌టుడే:** ఉద్యోగ జీవితం మరపురానిదని మండల ప్రత్యేకాధికారి బాలరాజు అన్నారు. ల్యాదళ్ల పంచాయతీ కార్యదర్శి బట్టు అన్నపూర్ణ ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. అధికారులు అన్నపూర్ణను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీవోలు రంగాచారి, వేలేరు ఎంపీవో విమల, ఆత్మకూరు ఎంపీవో విమల, ఏపీవో శారద, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## పంచాయతీ సిబ్బందికి వైద్య పరీక్షలు

**దామెర, న్యూస్‌టుడే:** స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక పీహెచ్‌సీలో పంచాయతీ సిబ్బందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ మంజుల, పీహెచ్ఎన్ లీల, సూపర్‌వైజర్ శ్రీకాంత్, హెల్త్ అసిస్టెంట్ సురేందర్ తదితరులు పాల్గొన్నారు.